మాతాశిశు సంరక్షణే ధ్యేయంగా...

- పీఎంఎస్ఎంఎ ద్వారా సేవలు
- మండపేట నియోజకవర్గంలోని 209 మందికి వైద్య పరీక్షలు
- 55 మందిని హైరిస్క్‌గా గుర్తింపు
- రామచంద్రపురం నియోజకవర్గంలో 225 మందికి..
- 46 మందిని హైరిస్క్‌గా నమోదు



అంగర పీహెచ్‌సీలో గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యురాలు

కపిలేశ్వరపురం: తల్లీ బిడ్డల సంరక్షణే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షేత్ర స్థాయిలో విశేష కృషి చేస్తున్నాయి. ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకునేలా విస్తృతంగా ప్రచారం కూడా చేస్తున్నాయి. ప్రతి నెలా క్రమం తప్పకుండా రెండో వారంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఎ) పేరుతో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్నారు.

మండలాల వారీగా గర్భిణుల పరీక్షలు ఇలా...

రామచంద్రపురం మండలంలో ఒక ఏరియా ఆసుపత్రి నాలుగు పీహెచ్‌సీల పరిధిలో 139 మంది గర్భిణులను పరీక్షించగా 21 మంది హైరిస్క్‌గా గుర్తించారు. కె.గంగవరం మండలంలోని నాలుగు ఆసుపత్రుల్లో 86 మంది గర్భిణులను పరీక్షించి 25 మందిని హైరిస్క్‌గా గుర్తించారు. మండపేట మండలంలో ఒక సీహెచ్‌సీ, నాలుగు పీహెచ్‌సీల పరిధిలో 95 మంది గర్భిణులను పరీక్షించగా 18 మందిని హైరిస్క్‌గా నమోదు చేశారు. కపిలేశ్వరపురం మండలంలోని మూడు పీహెచ్‌సీల పరిధిలో 52 మందిని పరీక్షించి 15 మందిని హైరిస్క్‌గా గుర్తించారు. రాయవరం మండలంలోని రెండు పీహెచ్‌సీలలో 62 మందిని పరీక్షించి 22 మందిని హైరిస్క్‌గా నమోదు చేశారు. మండపేట నియోజకవర్గంలోని 10 ఆసుపత్రిల్లోని 209 మందిని పరీక్షించి 55 మందిని హైరిస్క్‌గా నమోదు చేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని తొమ్మిది ఆసుపత్రుల్లో 225 మంది గర్భిణులను పరీక్షించగా 46 మందిని హైరిస్క్‌గా గుర్తించారు.

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలకు ప్రోత్సాహం ఇలా..

నూరు శాతం ప్రసవాలు ప్రభుత్వాసుపత్రిలోనే చేయించుకోవాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురం ఏరియా ఆసుపత్రులతో పాటు సీహెచ్‌సీ, పీహెచ్‌సీలలో ప్రసవాలు జరుగుతున్నాయి. మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవించే వరకూ ప్రభుత్వ వైద్య ఆరోగ్య సిబ్బంది క్రమం తప్పకుండా పరీక్షలు చేసి ఎప్పటికప్పుడు ఆరోగ్య వివరాలను నమోదు చేస్తున్నారు. ప్రసవం ప్రభుత్వ ఆసుపత్రిలోనే మేలంటూ ప్రభుత్వ ప్రోత్సాహకాలపై వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం విస్తృత అవగాహన కల్పించేది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలతో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేయించుకునేవారికి సైతం ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేసింది. ప్రసవం అనంతరం తల్లీ బిడ్డల పౌష్టికాహారానికి ప్రభుత్వం రూ.6 వేల ఆర్థిక సాయాన్ని సైతం తల్లి ఖాతాకు జమ చేస్తుంది.గర్భిణి ఇంటి వద్ద నుంచి ఆసుపత్రికి రావడానికి 108 అంబులెన్స్, డిశ్చార్జి అనంతరం ఇంటికి వెళ్లేందుకు 102 వాహన సౌకర్యం కల్పిస్తుంది. జిల్లాకు 13 తల్లీ బిడ్డా వాహనాలను కేటాయించింది. అమలాపురం, రామచంద్రాపురం ఏరియా ఆస్పత్రులకు రెండు చొప్పున నాలుగు వాహనాలను సీహెచ్‌సీలకు ఎనిమిది వాహనాలను కేటాయించారు. కపిలేశ్వరపురం, మండపేటలలో వాహనాలు అందుబాటులో ఉన్నాయి. శిశువుకి మొదటి టీకా వేస్తుంది.

హైరిస్క్ గర్భిణులను గుర్తించడం ఇలా

గర్భిణిలో రక్తహీనత, చిన్న వయసులో గర్భం దాల్చడం, ఎక్కువ కాన్పులు, అధిక బీపీ, గుండె, కిడ్నీ జబ్బులు, ఇతర సమస్యలతో గర్భం దాల్చిన మహిళలను హైరిస్క్ కేసులుగా పరిగణిస్తారు. వారి వివరాలను ఏఎన్ఎం ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తుంది. ఆసుపత్రికి ఎప్పుడు తరలించాలో నిర్ణయించి తగిన ఏర్పాట్లను ఉచితంగా చేస్తారు.

సాధారణ ప్రసవాలకూ ప్రోత్సాహం

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవం జరుపుకున్న బాలింతలకు ఆరోగ్య ఆసరా పథకంలో భాగంగా ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతులు అందజేస్తుంది. సాధారణ ప్రసవానికి రూ.4,000, సిజేరియన్ ప్రసవానికి రూ.3,000 ఇవ్వడంతో పాటు వారందరికీ పోషకాహారాన్ని సమకూర్చుకునేందుకు అదనంగా రూ.1000 అందజేస్తుంది.

తల్లీబిడ్డల సంరక్షణే ధ్యేయం



తల్లీ బిడ్డల ఆరోగ్య సంరక్షణ కోసం వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్ శాఖల సిబ్బంది శ్రమిస్తున్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేస్తున్నాం. ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవం చేయించుకునేలా గర్భిణికి, వారి సంరక్షకులకు అవగాహన కల్పిస్తున్నాం.


–డాక్టర్. ఎస్.ప్రశాంతి, సబ్ డివిజనల్ ఆఫీసర్, వైద్య ఆరోగ్య శాఖ, రామచంద్రపురం డివిజన్

పీహెచ్‌సీల వారీగా గర్భిణులకు పరీక్షలు ఇలా..

పీహెచ్‌సీ	పరీక్షించిన గర్భిణుల సంఖ్య	హైరిస్క్ గర్భిణుల సంఖ్య
ఆర్సీ పురం ఏరియా ఆసుపత్రి	45	06
ఆర్సీ పురం హరిజనపేట అర్బన్	18	–
ఆర్సీపురం ముచ్చిమిల్లి అర్బన్	10	--
వెల్ల	35	03
ద్రాక్షారామ	31	12
పామర్రు	31	04
పేకేరు	18	05
దంగేరు	18	11
కుందూరు	19	05
మండపేట సీహెచ్‌సీ	30	05
మండపేట హరిజనపేట అర్బన్ పీహెచ్‌సీ	06	--
మండపేట గొల్లపుంత అర్బన్ పీహెచ్‌సీ	21	--
డి.కేశవరం	17	10
ద్వారపూడి	21	03
అంగర	20	03
అచ్యుతాపురం	14	05
వాకతిప్ప	18	07
మాచవరం	32	15
రాయవరం	30	07
మొత్తం	**434**	**101**

క్లుప్తంగా

నేత్రదానం



వీరభద్రమ్మ

కె.గంగవరం: మండలంలోని పామర్రు గ్రామానికి చెందిన తూము వీరభద్రమ్మ (80) వృద్ధాప్యంతో మంగళవారం మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులు వీరభద్రమ్మ నేత్రాలను దానం చేయడానికి ముందుకు రావడంతో కాకినాడకు చెందిన ఐ బ్యాంక్ సిబ్బంది వారి గృహానికి చేరుకుని కార్నియాను సేకరించి భద్రపరిచారు. తల్లి మృతితో మరో ఇద్దరికి చూపు ఇవ్వడానికి నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులను గ్రామానికి చెందిన పలువురు అభినందించారు.

నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేసిన దాతలు

కె.గంగవరం: మండలంలోని కూళ్ల పంచాయతీ ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన చిట్టూరి రామ్మోహన్, చిట్టూరి సుబ్బారావు, చిర్రా రాజ్ కుమార్, పలివెల శ్రీనివాస్, పలివెల సామ్యేల్‌రాజు ఆధ్వర్యంలో విద్యార్థులందరికి నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్‌తో కూడిన బాక్సులు పంపిణీ చేశారు. రానున్న కాలంలో మంత్రి సుభాష్ పేరున సేవా కార్యక్రమాలు చేపడతామని నిర్వాహకులు తెలిపారు. పలివెల సతీష్, అభి, వీరేంద్ర, కొమ్ము రాజు, ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేశవరంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన



రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: మండలంలోని కేశవరం గ్రామంలో రూ.45 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మంగళవారం భూమి పూజ చేశారు. గ్రామంలోని సర్వారాయ సుగర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కేశవరం గ్రామాభివృద్ధికి ఈ నిధులు కేటాయించింది. ఈ మొత్తంతో కేశవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి కూసు వారి ఇంటి వరకూ సీసీ రోడ్డు నిర్మిస్తారు. కార్యక్రమంలో వుండమట్ల రామారావు, కర్రి తాతారావు, కంటిపూడి శ్రీనివాసరావు, వుండమట్ల సురేష్, ఆళ్ల రాజబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణం చేయిస్తున్న పండితులు

కపిలేశ్వరపురం: వల్లూరు గ్రామంలో సోమవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి, అయ్యప్పస్వామి, షిర్డీ సాయిబాబా దేవాలయాల సముదాయం 13వ వార్షికోత్సవం పూజల్లో భాగంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అమ్మవారిని, స్వామివారిని విశేషంగా అలంకరించారు. గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో కల్యాణోత్సవాన్ని తిలకించారు. స్వామి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

సహజ సిద్ధమైన ఆహారంపై అవగాహన ర్యాలీ



నరసాపురపుపేటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని నరసాపురపుపేటలో జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు రసాయనాలు లేని సహజ సిద్ధమైన ఆహారం తీసుకునే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న పర్యావరణ పక్షోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని కేకేఎల్ కుమారి, వ్యాయామ ఉపాధ్యాయులు జి.ఉమాశ్రీ వాణి, పి.రవికుమార్, గ్రామ పెద్దలు దంగేటి లోవరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



హాజరైన పంచాయతీ కార్యదర్శులు, వైద్య ఆరోగ్య, సచివాలయ సిబ్బంది



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణ

రాయవరం: సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ నౌడు వెంకటరమణ సూచించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వైద్య ఆరోగ్య సిబ్బందితో స్థానిక మండల పరిషత్ సమావేశపు హాల్లో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పంచాయతీ విస్తరణాధికారి శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ వెంకటరమణ మాట్లాడారు. వాతావరణ పరిస్థితులు మారినందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందన్నారు. అపరిశుభ్ర వాతావరణంతో వైరల్ జ్వరాలు, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున అధికారులు క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలిన తర్వాత తీసుకునే చర్యలకన్నా, ముందు జాగ్రత్త చర్యలతోనే వ్యాధులను కట్టుదిట్టంగా అరికట్టవచ్చునన్నారు. సమావేశంలో రూరల్ వాటర్ సప్లయ్ స్కీమ్ ఏఈఈ చైతన్యకుమారి, పంచాయతీ విస్తరణాధికారి శ్రీనివాసరావు, పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ ఎ.సరోజిని మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటినే తాగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తమం చేసేలా చైతన్యవంతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి సుభాష్ ఆర్థిక సహకారం



అగ్నిప్రమాద బాధితులకు మంత్రి సుభాష్ సమకూర్చిన ఆర్థిక సహకారాన్ని అందజేస్తున్న జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్

కాజులూరు: శీలలో అగ్నిప్రమాదానికి గురైన బాధిత కుటుంబానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.50 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ చేతుల మీదుగా స్థానిక కార్యకర్తల సమక్షంలో బాధితురాలు బండారు చంద్రావతికి నగదు రూపంలో సహకారాన్ని పంపిణీ చేశారు. పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు అయిన తర్వాత బండారు చంద్రావతి ఇల్లు ప్రమాదవశాత్తూ అగ్నికి ఆహుతై సర్వం కోల్పోయారన్నారు. కార్యకర్తల ద్వారా విషయం తెలుసుకున్న సుభాష్ బాధితులను పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.50 వేలు సహకారం అందజేశారన్నారు. కార్యక్రమంలో అన్యం శ్రీరామ్, గరగ కొండలరావు, మాధవరపు చంద్రరావు, కూనపురెడ్డి శ్రీను, మందపల్లి పండు, వాసిరెడ్డి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఓదూరు రైల్వే లైన్ వద్ద ఈ నెల 17న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందినట్లు రామచంద్రపురం ఎస్సై సురేష్‌బాబు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కరప మండలం వేళంగి గ్రామానికి చెందిన యరమాటి కృష్ణ చైతన్య చౌదరి(16) ఈ నెల 17 రాత్రి 6.50 గంటలకు వేళంగి గ్రామంలోని తన సోదరుడి షాపు ముందు ఉన్న సోదరుని బైక్ తీసుకుని ఎవరికీ చెప్పకుండా రామచంద్రపురం బయలుదేరాడు. ఓదూరు రైల్వే లైన్ వద్దకు వచ్చేసరికి స్పీడు బ్రేకర్ వద్ద అదుపుతప్పి పడిపోయాడు. దీనితో స్థానికులు యువకుడు పెదనాన్న యరమాటి వీరభద్రరావుకు సమాచారం ఇచ్చారు. ఆయన కృష్ణ చైతన్య చౌదరిని స్థానికంగా ఉండే గ్రామీణ వైద్యునికి చూపించి ఆయన సలహాతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారణ చేశారు. మృతుడి పెదనాన్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బదిలీపై వెళ్తున్న లక్ష్మణ్‌కుమార్‌కు సన్మానం



బదిలీపై వెళుతున్న లక్ష్మణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న తపాలా ఉద్యోగులు

మండపేట: రామచంద్రపురం పోస్టల్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసి బదిలీపై కాకినాడ వెళుతున్న ఎం.లక్ష్మణకుమార్‌ను మంగళవారం మండపేట పోస్టాఫీసులో సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. మెయిన్ రోడ్డులోని ప్రధాన తపాలా కేంద్రంలో పోస్ట్‌మాస్టర్ ఎస్. శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది లక్ష్మణ్‌కుమార్‌కు దుశ్శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్ల పాటు పని చేసిన లక్ష్మణ్‌కుమార్ ఉద్యోగులందరి మన్ననలూ పొందారన్నారు. సత్కరించిన వారిలో మండపేట, వల్లూరు, నేలటూరు, మారేడుబాక తపాలా సిబ్బంది ఉన్నారు. అలాగే రామచంద్రపురం నూతన సబ్ డివిజనల్ పోస్టల్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన పి.కామేశ్వరరావుకు ఉద్యోగులంతా సాదరంగా ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు కొండపల్లి సూర్యనారాయణ, కేవీ నారాయణరావు, మండపేట బజార్ పోస్ట్ మాస్టర్ బి. మురళి, ఎండీఎం షరీఫ్, జి. వెంకట్రావు, రిటైర్డ్ పోస్ట్‌మాస్టర్ టపా పుల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



రాంబాబు మృతదేహం

మండపేట: పట్టణంలోని గాంధీ నగర్‌కు చెందిన మిత్తిన రాంబాబు అనే వ్యక్తి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. టౌన్ ఎస్ఐ హరికోటి శాస్త్రి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాంబాబు సోమవారం మండపేట మెయిన్ రోడ్డులోని చౌదరి పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని మోటార్ సైక్లిస్టు వచ్చి ఢీ కొట్టారు. రక్తపు గాయాలైన రాంబాబును వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఆయనను కాకినాడ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాంబాబు మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ హరికోటిశాస్త్రి తెలిపారు.

మలి సంధ్య వేళలో..




రుతుపవనాల జాడే కానరావడం లేదు. వర్షాల మాటెలా ఉన్నా వేసవిని తలపిస్తూ సూర్యుడు పగబట్టినట్టు పగలంతా నిప్పులు చెరుగుతున్నాడు. ఓ పక్క మండే ఎండలు, ఉక్కబోతతో ప్రజలు సతమతం అవుతున్నారు. సాయంత్రం అయ్యేసరికి సూర్యుడు కాస్త కరుణిస్తున్నాడు. మండపేటలో మంగళవారం సాయం సంధ్య వేళ కనువిందు చేస్తున్న సూర్యుడు. – మండపేట

రేపు విద్యుత్ సమస్యలపరిష్కార వేదిక

కాజులూరు: జిల్లా కేంద్రమైన కాకినాడలో ఈ నెల 20వ తేదీ గురువారం సీజీఆర్ఎఫ్/ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో వినియోగదారులకు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. కాకినాడ రూరల్ సబ్‌డివిజన్ కార్యాలయంలో జరిగే ఈ విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికలో సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు వి.జనార్దనరావు, ఆర్థిక సభ్యులు ఎం.శ్రీనివాస్, డాక్టర్ ఆర్.సురేంద్రకుమార్ తదితర ప్రముఖులు పాల్గొని వినియోగదారుల నుంచి సమస్యలు తెలుసుకోనున్నారు. వినియోగదారులు హాజరై ఈ వేదిక ద్వారా తమ సమస్యలకు పరిష్కారాలు పొందవచ్చని కార్యాలయ సిబ్బంది తెలిపారు.

మనసు పెట్టి చదివితే ఉన్నత స్థితికి..

- డీవైఈఓ లక్ష్మీనరసింహ
- మాచర జెడ్పీ ఉన్నత పాఠశాల సందర్శన



పాఠశాల విద్యార్థులకు భోజనాన్ని వడ్డిస్తున్న డీవైఈఓ లక్ష్మీ నరసింహ

కపిలేశ్వరపురం: ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులు మనసు పెట్టి చదివితే ఉన్నత స్థితికి చేరుకుంటారని రామచంద్రపురం డీవైఈఓ శ్రీపాద లక్ష్మీ నరసింహ (ఫణి) విద్యార్థులకు సూచించారు. మండలంలోని మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించి వారితో ముచ్చటించారు. వారి సామాజిక స్థితిగతులను తెలుసుకుని చదువుకోవడం ద్వారా సమాజంలో ఉన్నత స్థితికి చేరుకోగలని ప్రోత్సహించారు. చదువుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సాయం అందిస్తుందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల స్థితిగతులను ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్. వెంకట్రావు వివరించారు. పాఠశాలలో రికార్డులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. 'నేను బడికిపోతా' కార్యక్రమం, చేరికలపై ఉపాధ్యాయులతో చర్చించారు.

చిన్నారుల ఆరోగ్యానికి అంగన్‌వాడీ కేంద్రం



వడ్లమూరులో గ్రాడ్యుయేషన్ చిన్నారులతో ఐసీడీఎస్ అధికారులు




వడ్లమూరులో చిన్నారులతో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కపిలేశ్వరపురం: చిన్నారుల సంక్షేమానికి సరైన మార్గం అంగన్‌వాడీ కేంద్రమని ఐసీడీఎస్ కపిలేశ్వరపురం ప్రాజెక్ట్ సీడీపీఓ గజలక్ష్మి అన్నారు. మండలంలోని టేకి సెక్టార్ వడ్లమూరులోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో మంగళవారం చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఎనిమిది మంది చిన్నారులను 1వ తరగతిలో చేర్పించారు. ఈ సందర్భంగా చిన్నారులకు గ్రాడ్యుయేషన్ వేషధారణలో అలంకరించి ప్రోత్సహించారు. అనంతరం 'అంగన్‌వాడీ పిలుస్తుంది' పేరుతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ గజలక్ష్మి మాట్లాడుతూ మూడో సంవత్సరంలోకి ప్రవేశించిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరారు. చేరిన చిన్నారులను చూసుకునే విధానంపై అవగాహన కల్పించారు. చిన్నారులను సంరక్షించిన అంగన్‌వాడీ కార్యకర్తలు పి.పద్మావతి, జి.వి జయరత్నం, ఆయాలను అభినందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యం, జీఎంఎస్‌కే బి.భాగ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా రావులమ్మ తీర్థం

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో వేంచేసిన రావులమ్మ అమ్మవారి తీర్థాన్ని మంగళవారం వైభవంగా జరిపారు. అమ్మవారికి గ్రామ ఆడపడుచులు చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం రాత్రి జరిగిన జాతరలో గరగ నృత్యాలతో పాటు కోయ డ్యాన్సులు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం అమ్మవారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పాఠశాలలకు ఆడిట్



ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆడిట్ నిర్వహించిన ఆడిటర్లు

ఆలమూరు: గ్రామ శివారు కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాలల ఆడిట్ అధికారులు ఆడిట్‌ను నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలోని జిల్లాలోని వివిధ పాఠశాలల ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఆడిట్‌ను జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేపట్టారు. హైదరాబాద్‌లోని జీసీ రెడ్డి అండ్ అసోసియేట్స్ నుంచి వచ్చిన ఆడిటర్లు బి.పవన్‌కల్యాణ్, ఎన్‌టైటస్, బి.శివరమేష్‌లు పాఠశాలల ఆడిట్ నిర్వహించారు. ఆలమూరు, కె.గంగవరం, రామచంద్రపురం, కపిలేశ్వరపురం, రాయవరం, మండపేట, రావులపాలెం, కొత్తపేట మండలాలకు చెందిన 215 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, ఆయా మండలాల విద్యాశాఖ కార్యాలయాలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఈ ఆడిట్ జరిగినట్లు మండల విద్యాశాఖాధికారులు పి.షాలెంరాజు, పీవీ సుబ్బరాజు తెలిపారు. జిల్లా సమగ్ర శిక్షా ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ అధికారి జి.ప్రవీణ్‌కుమార్, ఏఎంవో పి.రాంబాబు తదితరులు ఈ ఆడిట్ నిర్వహణను పర్యవేక్షించారు. ఎఫ్ఏవో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ బుధవారం అమలాపురం బాలుర ఉన్నత పాఠశాలలో అమలాపురం, అయినవిల్లి, అల్లవరం, అంబాజీపేట, ఐ.పోలవరం, కాట్రేనికోన, మలికిపురం, మామిడికుదురు, ముమ్మిడివరం, పి.గన్నవరం రాజోలు, సఖినేటిపల్లి, ఉప్పలగుప్తం మండలాలకు చెందిన 385 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, ఆయా మండలాల ఎంఆర్‌సీ కార్యాలయాల ఆడిట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రధానోపాధ్యాయులు భమిడిపాటి అప్పాజీ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ వి.నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.